క్లుప్తంగా

జోరుగా వ్యవసాయ పనులు



దొర్నిపాడు శివారులో మినుము పంటలో కలుపు తీస్తున్న కూలీలు

దొర్నిపాడు: రెండు నెలలుగా మండలంలో వ్యవసాయ పనులు మందగించడంతో కూలీలకు ఇబ్బందికరంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి విత్తనాలు నాటడం, అలాగే ముందస్తుగా సాగుచేసిన మినుము పంటలో కలుపు తీత పనులు లభిస్తుండటంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బోర్ల కింద వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి నాటు వేసే కూలీలకు రూ.500పైగా, కలుపు తీత పనులకు రూ.200 కూలీ ఇస్తున్నారు. ఇక కుందూ, కేసీ కెనాల్ కింద కూడా వరినాట్లు మొదలైతే కూలీలకు డిమాండ్ నెలకొంటుంది.

హెచ్ఎంల నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం ఎన్నికలు ఆదివారం ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడిగా గుత్తి డిప్యూటీ ఈఓ డీటీ శంకర్‌ప్రసాద్ వ్యవహరించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరేంద్రనాథ్, ఉపాధ్యక్షుడిగా ఎంసీ తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా లింగన్న, సహాయ కార్యదర్శిగా నరసింహులు, కోశాధికారిగా శివరాంప్రసాద్, కౌన్సిల్ మెంబర్లుగా భాస్కరరెడ్డి, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షులుగా రసూల్‌ఖాన్, మహిళా సభ్యులుగా ఫరహత్ నసీంను ఎన్నుకున్నట్లు చెప్పారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు:మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, హారతులు పట్టారు. భక్తులు అమ్మవారికి చీర, సారె, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

కార్మిక చట్టాల అమలుకు ఉద్యమించాలి

నంద్యాల(న్యూటౌన్): కార్మిక చట్టాల అమలు కోసం ప్రతి కార్మికుడు ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాల సీఐటీయూ కార్యాలయంలో జిల్లా నిర్మాణ వర్క్‌షాప్‌నకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి దారులకు రూ.లక్ష కోట్లు సబ్సిడీ రుణాలు ఇవ్వడం, మరుసటి రోజు రుణాలను రద్దు చేయడం రివాజుగా మారిందన్నారు. వారి చర్యల కారణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిపోయి సామాన్యులపై భారం మోపారని మండిపడ్డారు. విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మణిపూర్ సంఘటనపై ఇప్పటి వరకు చర్యలకు ఉపక్రమించకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. నాయకులు నాగరాజు, తోటమద్దులు, భాస్కరరెడ్డి, ఎల్లయ్య, గౌస్, బాలవెంకట్, శివరాం, గురుస్వామి, తిరుపతయ్య, రత్నమయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుదామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సుంకయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది.సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆప్కోస్‌లో విలీనం చేసిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న రాయితీలన్ని ఆప్కోస్ వర్కర్స్‌కు వర్తింపజేయాలని కోరారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్ల కొరత తీర్చాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రఘురాంమూర్తి, శివబాలకృష్ణ,ప్రసాద్, శ్రీనివాసులు, రవి, ప్రతాప్, బీసన్న, హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల అంజుమన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.6.20 లక్షల చెక్కులను ఆదివారం స్థానిక కార్యాలయంలో అధ్యక్షుడు అబ్దుల్‌కుద్దూస్ ఆధ్వర్యంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే.. పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన 220 మంది విద్యార్థులకు రూ.3వేలు చొప్పున రూ.6.20 అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఫరీదాషహావత్, బ్రాంచ్ మేనేజర్ సురేంద్ర, అబ్దుల్‌సమ్మద్, అబ్దుల్‌బాషా సిద్ధిఖ్, అబ్దుల్‌హక్, గౌస్ పాల్గొన్నారు.

అప్పటి వరకు ఉన్నంతలో సజావుగా సాగుతున్న ఆ కుటుంబం.. ఒక్కసారిగా యజమాని అకాల మృత్యు బారిన పడితే.. ప్రమాదవశాత్తు దుర్మరణం చెందితే.. ఆ కుటుంబ సభ్యుల బాధ వర్ణనాతీతం. అసలే నిరుపేదలు, ఆదాయం అంతంత మాత్రమే. కుటుంబ పోషణకు అష్టకష్టాలు. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాలని జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ బీమాను అమలు చేస్తుంది. రేషన్ కార్డుదారులు ఇందుకు అర్హులు. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించి బీమా వర్తింపజేస్తుంది.

కుటుంబానికి అండగా బీమా

- నిరుపేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా
- ప్రీమియం చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రైస్ కార్డు దారులందరూ అర్హులే
- బీమా పథకానికి 18 – 70 ఏళ్ల లోపు వారు అర్హులు
- సహజ మరణానికి రూ.లక్ష, ప్రమాద మరణానికి రూ.5 లక్షల పరిహారం





వైఎస్సార్ బీమా నమోదు చేస్తున్న వలంటీర్, పరిహారం అందుకుంటున్న లబ్ధిదారులు

నంద్యాల(న్యూటౌన్): పేదల కుటుంబాలకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిని వైఎస్సార్ క్రాంతి పథకం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 4,76,537 కుటుంబాలకు రూ.17.50 కోట్లు మేర ప్రయోజనం చేకూరింది. ఈ పథకంలో అర్హులను చేర్పించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది క్షేత్రస్థాయిలో సర్వేను ఇప్పటికే ప్రారంభించింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రైస్ కార్డుదారుల కుటుంబ వివరాలను సేకరించి గ్రామ, వార్డు, సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లకు నివేదిస్తున్నారు. వారు ఆ వివరాలను నమోదు చేసుకొని అర్హులను ఎంపిక చేస్తున్నారు. బియ్యం కార్డు కలిగిన కుటుంబ యజమాని పేరిట బీమా చేస్తున్నారు. ప్రీమియం చెల్లింపు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంది.

ముమ్మరంగా నమోదు..

జిల్లాలో 4,81,742 మంది కార్డు దారులు ఉన్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి 4,53,499 మంది వివరాలను నమోదు చేశారు. వీరిలో ఈ ఏడాది కొత్తగా నమోదు చేసుకున్న వారు 23,038 మంది ఉన్నారు.

ప్రయోజనాలు..

- వైఎస్సార్ బీమా పథకానికి 18 నుంచి 70 ఏళ్ల లోపు వయస్సు కలిగిన రైస్ కార్డుదారులు అర్హులు.
- 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సున్న వారు సహజ మరణం పొందితే నామినీకి రూ.లక్ష బీమా మొత్తం వస్తుంది.
- ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా రూ.5లక్షల వరకు బీమా సొమ్మును నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.
- 51 – 70 సంవత్సరాల వయస్సు కలిగిన లబ్ధిదారులు ప్రమాదంలో మరణించినా, లేక పూర్తి అంగవైకల్యం కలిగినా వారసులకు రూ.5లక్షల బీమా మొత్తం చెల్లిస్తారు. తక్షణ సాయం కింద రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తారు.

ప్రీమియం బాధ్యత ప్రభుత్వానిదే..

పేదలపై బీమా ప్రీమియం భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఆ మొత్తాన్ని చెల్లిస్తుంది. లబ్ధిదారుడికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య, పాలసీ నంబరు కేటాయిస్తారు. పథకానికి సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 155214 టోల్‌ఫ్రీ నంబరును ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అర్హత కలిగిన వారిని ఈ పథకంలో నమోదు చేస్తారు.

నామినీలుగా కుటుంబ సభ్యులే..

ఈ పథకంలో లబ్ధిదారుడితో పాటు నామినీలుగా లబ్ధిదారుడి భార్య, 21ఏళ్ల కుమారుడు, పెళ్లికాని కుమార్తె, వితంతువు కుమార్తె, లేదా ఆమె పిల్లలు, తల్లిదండ్రులు ఉంటారు.

అర్హతలు..

- బియ్యం కార్డు దారుడై ఉండాలి. ఇంట్లో సంపాదించే వ్యక్తికి బీమా లభిస్తుంది. భార్య, పిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులు నామినీగా ఉంటారు.
- భర్త చనిపోయి ఉంటే.. ఆయన భార్య కుటుంబాన్ని పోషిస్తుంటే ఆమె పేరున బీమా ఉంటుంది. పిల్లలు, వృద్ధులు నామినీగా ఉంటారు.
- ఉమ్మడి కుటుంబంలో పోషించే వారు ఇద్దరు ముగ్గురు ఉంటే వారిలో పోషించే వ్యక్తిని ఆ కుటుంబం నిర్ణయించుకుంటుంది.
- నెల వారి ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12వేల లోపు ఉండాలి.
- మాగాని మూడు ఎకరాలు, లేదా మెట్ట పది ఎకరాల కన్నా తక్కువ ఉన్న వారు అర్హులు.
- పాలసీదారులకు గుర్తింపు కార్డును ప్రభుత్వం విడుదల చేస్తుంది.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా నమోదు...

నియోజకవర్గం	నమోదు	అర్హులు
నంద్యాల	5,368	215
ఆళ్లగడ్డ	3,103	209
పాణ్యం	850	83
శ్రీశైలం	3,508	209
నందికొట్కూరు	3,099	212
బనగానపల్లె	3,446	242
డోన్	3,644	215

భర్త చనిపోయాక అండగా



నా భర్త గుండె పోటుతో చనిపోయారు. ఇద్దరు చిన్నపిల్లలు. వైఎస్సార్ బీమాలో నమోదు చేయించుకోవడం వల్ల అంత్యక్రియలకు వెంటనే రూ.10వేలు ఇచ్చారు. ఆ తర్వాత నా ఖాతాల్లో రూ.90వేలు జమ చేశారు. దీంతో ఇంటి వద్ద కుట్టుమిషన్, అంగడి పెట్టుకొని పిల్లలతో బతుకుతున్నాను. బీమా పథకంలో నమోదు చేయించుకోవడం వల్ల ఆర్థికంగా భరోసా లభించింది. – లక్ష్మిదేవి, నూనెపల్లె, నంద్యాల

విద్యను బలోపేతం చేయండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రాథమి పాఠశాలలను ముక్కలు చేసే విధానానికి స్వస్తి పలికి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ నంద్యాల జిల్లా శాఖ సభ్యులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా కన్వీనర్ మాధవస్వామి ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ 1938 డీటీఎఫ్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసే 84, 85, 117 ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఆయా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోతున్నాయని, పేద బడుగు, బలహీన వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ విద్యావిధానం–2020 రాష్ట్రంలో అమలు చేయరాదని, ఎయిడెడ్ పాఠశాలలను మూసివేతను ఉపసంహరించుకోవాలని కోరారు. నాయకులు కిశోర్, రాంబాబు, లాజరస్, రవి, గోపాల్‌రావు, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, మస్తాన్, రమేష్, పోలియోనాయక్ పాల్గొన్నారు.

క్యాన్సర్, ఎముకల వ్యాధులపై అవగాహన

నంద్యాల(వ్యవసాయం): రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల ఆధ్వర్యంలో స్థానిక రోటరీ భవనంలో క్యాన్సర్, కంటి, ఎముకలు, కీళ్లకు సంబంధించిన వ్యాధులపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ వైద్య నిపుణులు సాయిప్రణీత్ మాట్లాడుతూ క్యాన్సర్ భయంకరమైన వ్యాధి కాదని, అవగాహనతో చికిత్స నిర్వహించుకుంటే నయం అవుతుందన్నారు. డాక్టర్ కృష్ణసాహితీ కంటి జబ్బులపై, డాక్టర్ వికాస్ కీళ్ల వ్యాధులపై అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు దండె దస్తగిరి మాట్లాడుతూ కోటపాడు గ్రామానికి చెందిన చెన్నకేశవ స్వామి గుడికి ఫెడస్టల్ ఫ్యాన్ అందజేశామని చెప్పారు. సభ్యులు శ్రీరామ్మూర్తి, బాలకృష్ణ, హరినాథ్, సుధాప్రసాద్, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ ఆదివారం తెలిపారు. గ్రామశివారులోని ముళ్లపొదల్లో ఆడుతున్న ఓబులేసు, కమాల్‌సా, వెంకటేశ్వర్లు సుధాకర్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3,610 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

అదనపు ఉపాధ్యాయులను నియమించాలి

గోస్పాడు: ఏకోపాధ్యాయ పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయులను నియమించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు, శ్రీనివాసులు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులు నిర్వహించడం, యాప్స్ చూసుకోవడం, నాడు–నేడు పనులు చూసుకోవడం కష్టంగా ఉన్నందున ప్రతి ఏకోపాధ్యాయ పాఠశాలకు అదనపు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అలాగే సరెండర్ లీవ్స్ మొత్తాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సురేష్, కుమార్, సుబ్బారాయుడు నాయక్, రాజ శేఖర్ రెడ్డి, షఫ్రక్ బాబు, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

తిలక్, ఆజాద్ పోరాటాలు మరువలేనివి



తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గణేష్ మహోత్సవ సమితి నాయకులు



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిజేబుల్డ్ రైట్స్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం)/(అర్బన్): జాతీయోద్యమంలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్, ఆజాద్ హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ ఆజాద్ చేసిన పోరాటాలు మరువలేనివని గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు నిమ్మకాలయ సుధాకర్, డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి కొనియాడారు. బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా ఆయా కార్యాలయాల్లో సంస్థ అధ్యక్షులు వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సామాన్య ప్రజల్ని జాతీయోద్యమంలో పాల్గొనేటట్లు బాలగంగాధర్ తిలక్ కృషి చేశారన్నారు. సత్యనారాయణ, నాగేంద్ర, రవి, శంకర్, మోహన్, కిరణ్‌కుమార్, నబిరసూల్, బాషా, ఆరీఫ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు గ్రామం వద్ద లారీ ఢీ కొట్టడంతో మహిళకు తీవ్రగాయాలపాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జల్లా నాగలక్ష్మమ్మ నీళ్ల తెచ్చుకునేందుకు రోడ్డు పక్కన ఉన్న వడ్డే రామచంద్రుడు ఇంటి వద్దకు వెళ్లింది. బిందెను ఎత్తుకుని రోడ్డుకు ఎడమవైపు వస్తుండగా జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి టీఎస్31బీఎల్ 8754 నంబరుగల లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. నాగలక్ష్మమ్మ రెండు కాళ్లపై లారీ టైర్లు ఎక్కిపోవడంతో కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. తీవ్రగాయాలపాలనైన నాగలక్ష్మమ్మను 108లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె తమ్ముడు బింగి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

కనుమరుగవుతున్న పేదోడి కూల్‌డ్రింక్

- గోలీ సోడాకు ఆదరణ కరువు



చాగలమర్రిలో గోళి సోడా తాగుతున్న దృశ్యం,



గోళీ సోడా బండి

చాగలమర్రి: గతంలో.. షర్బత్, జింజర్ సోడా, నిమ్మకాయ సోడా, గోలీ సోడాలను శీతల పానీయాలుగా సేవించేవారు. కొన్నేళ్ల క్రితం వరకు వీటికి మంచి డిమాండ్ ఉండేది. ఉదయం 11 గంటలు దాటిన తరువాత తోపుడు బండిలో సోడా సీసాలు, షర్బత్, నిమ్మకాయలు, ఉప్పు, అల్లం, జిలకర పొడి తదితర వాటిని ఉంచుకొని నిర్వాహకులు వచ్చేవారు. పట్టణాల్లో మధ్యాహ్నం సమయంలో వీటికి మంచి గిరాకీ ఉండేది. ఇక పల్లెల్లో సాయంత్రం 5:30 గంటల నుంచి వీధుల్లో తిప్పి సోడాలు విక్రయించే వారు. ప్రస్తుతం గోళీ సోడా కనుమరుగైంది. కేవలం పెద్ద హోటళ్లలో అధిక ధరలకు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని తమ బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నారు. అయినా భోజనం తరువాత వీటిని తాగేందుకు ప్రజలు నేటికీ మక్కువ చూపుతున్నారు. అయితే నేటి తరానికి దీని గురించి పెద్దగా తెలియడం లేదు. స్థానిక గుంతపాశం వీధికి చెందిన లాలుబాషా అనే వ్యక్తి గత 50 సంవత్సరాలుగా ఈ వ్యాపారాన్నే కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాయంకాలం 6.00 గంటల నుంచి గ్రామంలోని వీధుల్లో తోపుడు బండిలో గోళీసోడాను తీసుకెళ్లి విక్రయిస్తున్నాడు. రోజుకు రూ.200 నుంచి రూ.300 వరకు మిగులుతుందని చెబుతున్నారు. అయినా నేటికీ ప్రజలు ఇష్టంగా తాగుతున్నారని ఆయన చెబుతున్నాడు. గతంలో వేసవి కాలంలో చల్లటి చెట్ల నీడన సేద దీరుతూ, వరిగడ్డిలో రాత్రంతా మగ్గి చల్లగా వున్న షర్బత్ సోడాను సేవిస్తూ తియ్యదనాన్ని ఆస్వాదించే వారని వివరిస్తున్నాడు. ఎవరికైనా అజీర్తి చేస్తే అల్లం సోడా, జింజర్ సోడా తాగేవారని, దీంతో ఉపశమనం లభించేదని పేర్కొంటున్నాడు.

మనువరాలుగా..తోబుట్టువుగా

ఈ వృద్ధురాలి పేరు మేకల సీలమ్మ. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల ఎస్సీ కాలనీ. భర్త లేడు. ఉన్న ఒక్క కూతురు దివ్యాంగురాలు. వీరి పరిస్థితిని గమనించిన వలంటీర్ జయంతి వారి కుటుంబంలో సభ్యురాలిగా సేవలు అందిస్తున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరికి పింఛన్ వచ్చేందుకు ఉన్న టెక్నికల్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన ధ్రువ పత్రాలు మంజూరు చేయించి ఇద్దరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుంది.ప్రతి నెల ఒకటోతేదీన తెల్లారక ముందే తల్లీ కూతుళ్లకు పింఛన్ సొమ్ము అందజేస్తుంది. అలాగే ప్రతి వారం వైద్యసిబ్బందిని వారి ఇంటి దగ్గరకు తీసుకెళ్లి ఇరువురికీ వైద్య పరీక్షలు చేయిస్తుంది. అవసరమైన మందులు తీసుకొచ్చి ఇస్తుంది. కరోనా సమయంలో ఇంటింటికీ తిరిగి నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఏఎన్ఎంల సాయంతో మందులు పంపిణీ చేసింది. ఇలా తనకు కేటాయించిన 60 ఇళ్లల్లోని వారికి అందరికి తలలో నాలుకలా వ్యవహరిస్తోంది. ఈమె సేవలకు ప్రభుత్వం 'సేవా వజ్ర' అవార్డుతో సత్కరించింది. – ఆళ్లగడ్డ



సీలమ్మకు పింఛన్ అందజేసేందుకు బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ జయంతి (ఫైల్)

మా కష్టాలన్నీ తీర్చింది..



మా ఇంట్లో మగవారు ఎవరూ లేరు. నేను వృద్ధాప్యంతో కింద పడి కాలు విరిగి నడువలేను. నా కుమార్తెకు మూగ, చెవుడు. ఏం చేయాలో మాకు దిక్కుతెలియలేదు. కష్టకాలంలో మా వలంటీర్ జయంతి మాకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. ఏమిచ్చినా ఆమె తీర్చుకోలేం. సొంత బిడ్డ అయినా ఇంత సేవ చేసి ఉండేది కాదేమో. మా కష్టాలన్నీ తీర్చుతోంది. – మేకల సీలమ్మ

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6,30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

గోస్పాడు: మండలంలోని రైతులకు 9గంటల పాటు నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు విద్యుత్ ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సరఫరాను రెండు గ్రూపులుగా విభజించినట్లు చెప్పారు. సోమవారం నుంచి ఆదివారం వరకు ఏ గ్రూపులో గోస్పాడు సబ్ స్టేషన్ పరిధిలో ఒంటి వెలగల ఫీడర్ కింద యాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలో ఎం.కృష్ణాపురం, యాళ్లూరు ఫీడర్ల కింద, దీబగుంట్ల సబ్ స్టేషన్ పరిధిలో చెన్నూరు, నాగులవరం, దీబగుంట్ల ఫీడర్ల కింద ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. అలాగే బి గ్రూపులో ఎం.చింతకుంట్ల, యాళ్లూరు ఫీడర్ కింద సత్యనారాయణాపురం, దీబగుంట్ల ఫీడర్ కింద మసీదుపురం, మోతుకుల పల్లె గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

కొత్తూరులో ప్రత్యేక పూజలు



ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్‌బాబును సన్మానిస్తున్న అర్చకులు, సిబ్బంది

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు వీఐపీలు తరలివచ్చారు. కర్నూలు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్‌బాబు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కల్యాణి, నంద్యాల సీనియర్ సివిల్ జడ్జి అర్జున్, తెలంగాణ రాష్ట్ర గద్వాల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రభాకర్, అలాగే మై హోమ్ జీఎం (మహా సిమెంట్)శివ ప్రసాద్ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. వారికి అర్చకులు, కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు చేయించి, స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ, సురేష్ పాల్గొన్నారు

బిల్లును ఆమోదించాలి



నిరసన తెలుపుతున్న వాల్మీకి సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ తీర్మానం బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా అన్ని రాజకీయ పక్షాలు ప్రధాన మంత్రిని ఒప్పించాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులికొండన్న, ప్రధాన కార్యదర్శి లాలుస్వామి కోరారు. బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందాలని కోరుతూ ఆదివారం ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వాల్మీకులు టెక్కె మార్కెట్‌యార్డు నుంచి బస్టాండ్ సమీపంలోని వాల్మీకి విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ 67ఏళ్ల వాల్మీకుల చిరకాల కోరిక అయిన ఎస్టీ పునరుద్ధరణకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు హామీలు ఇస్తున్నాయని, అనంతరం మరిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపి చేతులు దులుపుకుందని గుర్తు చేశారు. నాయకులు నాగేశ్వరరావు, జయరాజు, మధుగోపాల్, నారాయణ, లాయర్‌సుబ్బరాయుడు, స్వామినాయుడు, మురళీకృష్ణ, పెద్దయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. అయితే సచివాలయాల పరిధిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోని వాటిని మాత్రమే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో అర్జీలు అందజేయాలని కోరారు.

పోస్టులను భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పదవీ విరమణ ద్వారా ఖాళీగా ఏర్పడిన ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సహ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్‌బాషా, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ కోరారు. ఆదివారం స్వామి వివేకానంద ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి మేజర్ గ్రామ పంచాయతీలోనున్న ప్రాథమిక పాఠశాలలను కలిపి ఒకే పాఠశాలగా ఏర్పాటు చేసి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. వెంకటరామిరెడ్డి, ప్రసాదరెడ్డి, నాగేంద్ర, రిటైర్డు ఉపాధ్యాయులు జయప్రకాష్, నూరుల్లా పాల్గొన్నారు.

రుద్రవరంలో ఉచిత వైద్య శిబిరం

రుద్రవరం: స్థానిక అమ్మవారి సెంటర్‌లోని ప్రభుత్వ మెయిన్ పాఠశాలలో ఆది వారం నంద్యాల ఉదయానంద వైద్యశాల వైద్యులు చిన్నపిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 78 మంది చిన్నారులకు డాక్టర్ నయన్‌బాబ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అపస్మారక స్థితి, గుండె సమస్యలు,విరోచనాలు,పచ్చ కామెర్లు, విష జ్వరాలు, దగ్గు, న్యుమోనియా వంటి వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేశారు. మదార్‌వలి, రవిశేఖర్, స్టాఫ్ నర్సు గ్రేస్ పాల్గొన్నారు.